స్వీయ రక్షణకు కరాటే దోహదం

● మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

విద్యార్థులను అభినందిస్తున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట టౌన్, ఫిబ్రవరి 16: స్వీయ రక్షణకు కరాటే దోహదపడుతుందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని రవి మహల్‌లో నిర్వహించిన జపాన్ కరాటే స్టేట్ లెవల్ క్యాంపునకు ఆయన హాజరై శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేసి అభినందించారు. అనంతరం జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ.. చిన్నారులు, మహిళలు కరాటేలో రాణించాలని అన్నారు. విద్యార్థులు ఎంచుకున్న రంగంలో క్రమశిక్షణతో సాధన చేసి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కరాటే శిక్షకులు సోహం తెంజీ, తాహేర్‌పాషా, రియాజుద్దీన్, ఖాసీం, రామలింగం, శ్రీనివాస్, సూర్య, మధు, రామాంజిరెడ్డి, శివ, సాజిత్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించాలి

● బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ఒంటెద్దు నర్సింహారెడ్డి

నేరేడుచర్ల, ఫిబ్రవరి 16: తెలంగాణ రాష్ట్ర సాధకుడు, రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలను హుజూర్‌నగర్ నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఘనంగా నిర్వహించాలని బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ఒంటెద్దు నర్సింహారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. వేడుకల సందర్భంగా స్వచ్ఛంద కార్యక్రమాలను చేపట్టడంతో పాటు బ్లడ్ క్యాంపులను ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ ఆసుపత్రులలోని రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేయాలని కోరారు.

పాలకవీడులో కేక్ కటింగ్‌కు ఏర్పాట్లు..

పాలకవీడు: కేసీఆర్ జన్మదినం సందర్భంగా బీఆర్ఎస్ మండల పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 10 గంటలకు మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట కేక్ కట్ చేసి మొక్కలను నాటనున్నట్లు బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కిష్టిపాటి అంజిరెడ్డి తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అన్ని గ్రామాల బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి రవినాయక్, ప్రచార కార్యదర్శి పసుపులేటి సైదులు, మండల ఉపాధ్యక్షుడు తాటికొండ వెంకటరెడ్డి, మంద నాగయ్య పాల్గొన్నారు.

మఠంపల్లిలో ..

మఠంపల్లి: మండల కేంద్రంలో ఉదయం 9 గంటలకు కేసీఆర్ జన్మదిన వేడుకలు జరుపుతున్నట్లు బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఇరుగు పిచ్చయ్య, సీనియర్ నాయకుడు మన్నెం శ్రీనివాస్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు.

సోమప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు

నేరేడుచర్ల: కేసీఆర్ జన్మదినం సందర్భంగా మండలంలోని అతి పురాతనమైన సోమప్ప సోమేశ్వర ఆలయంలో సోమవారం ఉదయం 9 గంటలకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు అరిబండి సురేశ్‌బాబు తెలిపారు. ఆదివారం నేరేడుచర్లలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పూజల అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద కేక్ కటింగ్ ఉంటుందని, బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

మునగాలలో..

మునగాల: మండల కేంద్రంలోని రాజ కాంప్లెక్స్‌లో ఉదయం 10 గంటలకు వేడుకలను నిర్వహిస్తున్నట్లు బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు తొగరు రమేశ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

'స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలి'

మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మల్లయ్య

నూతనకల్, ఫిబ్రవరి 16: త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలని ఆ పార్టీ మండలాధ్యక్షుడు మున్న మల్లయ్య కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చి రైతులను మోసం చేస్తున్నదని విమర్శించారు. రాష్ట్రంలోని ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై ఆగ్రహంగా ఉన్నారని అన్నారు. సమావేశంలో నాయకులు గాద్దుల లింగరాజు, బత్తుల సాయిలు, బత్తుల విద్యాసాగర్, మొగుళ్ల వెంకన్న, బత్తుల విజయ్‌కుమార్, ఉప్పుల వీరు, మూరగుండ్ల సైదులు, వీర మల్ల యాదగిరి, సంగినేని సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి'

కోదాడ టౌన్: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి పూల రవీందర్

కోదాడ టౌన్, ఫిబ్రవరి 16: ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను గెలిపిస్తే ఉపాధ్యాయులు, అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పూల రవీందర్ అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం కోదాడ పట్టణంలో పలువురు ఉపాధ్యాయులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. అనంతరం జాక్టో నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. తనను గెలిపిస్తే ఉపాధ్యాయులు కోరుకుంటున్న సీపీఎస్ రద్దుకు కృషి చేస్తానని అన్నారు. హెల్త్‌కార్డులు, మెరుగైన పీఆర్సీ ఇప్పించడంతో పాటు మోడల్ స్కూల్స్, గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు. ఖాళీగా ఉన్న అన్ని పోస్టులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి భర్తీ చేయిస్తానన్నారు. సమావేశంలో ఓరుగంటి నాగేశ్వరరావు, బంధం వెంకటేశ్వర్లు, కేవీ.సత్యనారాయణ, ఆర్.శ్రీనివాసరావు, ఆర్సీ రెడ్డి, వెంకటేశ్వర్లు, చందులాల్, భాస్కర్, రూప్లా, ఆదినారాయణ, అంకిరెడ్డి, కాశీం, చంద్రశేఖర్, నరసింహారావు, రామాంజనేయులు, లింగయ్య పాల్గొన్నారు.

హుజూర్‌నగర్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పూల రవీందర్ ఆదివారం హుజూర్‌నగర్‌లో ప్రచారం నిర్వహించారు. ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బంధం వెంకటేశ్వర్లు, నాయకులు రవి, సత్యనారాయణ, పరమేశ్, వేణు, వెంకటేశ్వర్లు, అంజయ్య పాల్గొన్నారు.

ఇంధన వనరులను పొదుపుగా వాడుకోవాలి

● ఐఓసీఎల్ సేల్స్ ఆఫీసర్ దిలీప్‌నాయక్

ఇంధన పొదుపుపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది

నల్లగొండ రూరల్, ఫిబ్రవరి 16 : ప్రతి వ్యక్తి ఇంధన వనరులను పొదుపుగా వాడుకోవాలని ఐఓసీఎస్ సేల్స్ ఆఫీసర్ ప్రదీప్‌నాయక్ సూచించారు. కేంద్ర ప్రభుత్వ సూచన మేరకు ఆదివారం జిల్లా కేంద్రం నల్లగొండలో ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ యాజమాన్యం ఆధ్వర్యంలో ఇంధన పొదుపుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిలాజ ఇంధనాలను మరింత పొదుపుగా వినియోగించుకునే విధంగా ప్రజలందరికీ తెలియజేయాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణం, చక్కని పర్యావరణాన్ని అందించేందుకు ఇంధన వనరులను పొదుపుగా వాడుకోవాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇండియన్ గ్యాస్ యానమాన్యంతో పాటు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జాతర విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

● ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్

జాతర సరళిని పరిశీలిస్తున్న ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్

సూర్యాపేట టౌన్, ఫిబ్రవరి 16: జాతర విధుల్లో అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ పోలీస్ అధికారులను ఆదేశించారు. ఆదివారం రాత్రి పెద్దగట్టు జాతర సరళిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సీసీ టీవీ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌ను, గుట్ట చుట్టూ భద్రతా చర్యలను తనిఖీ చేసి పోలీస్ బందోబస్తును పర్యవేక్షించారు. పెద్దగట్టు దేవస్థానం వద్ద, ఎగ్జిబిషన్ రోడ్డు, కోనేరు, వీఐపీ మార్గం, హైవేపై వాహనాల శ్రేణి, తూర్పు మెట్ల వద్ద బందోబస్తు, భద్రతా చర్యలను పరిశీలించారు. ఎస్పీ వెంట ఏఎస్పీ నాగేశ్వర్‌రావు, జనార్ధన్‌రెడ్డి, డీఎస్పీ రవి, శ్రీధర్‌రెడ్డి, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ నాగభూషణం, ఎస్ ఐలు, సిబ్బంది ఉన్నారు.

వాహనాల దారి మళ్లింపు

కోదాడ రూరల్: సూర్యాపేట శివారులోని దురాజ్‌పల్లి గుట్టపై ఆదివారం ప్రారంభమైన పెద్దగట్టు జాతర సందర్భంగా జాతీయ రహదారిపై పోలీసులు వాహనాల దారి మళ్లింపు చేపట్టారు. ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న వాహనాలను కోదాడ పట్టణ పరిధిలోని హుజూర్‌నగర్ ఫ్లైఓవర్ వద్ద పోలీసులు దారి మళ్లించి హుజూర్‌నగర్ మీదుగా హైదరాబాద్‌కు పంపించారు.

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

● ఆర్టీసీ ఆర్ఎం జాన్‌రెడ్డి

డిపో అధికారులకు సూచనలు చేస్తున్న ఆర్ఎం జాన్‌రెడ్డి

సూర్యాపేట అర్బన్, ఫిబ్రవరి 16: పెద్దగట్టు జాతరకు హాజరయ్యే భక్తులకు ఆర్టీసీ సిబ్బంది మెరుగైన సౌకర్యాలను కల్పించాలని, ఎటువంటి ఇబ్బందులు ఉన్నా ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని ఆర్టీసీ ఉమ్మడి నల్లగొండ రీజినల్ మేనేజర్ జాన్ రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో జాతర బస్ సర్వీసులను ఆయన పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. జాతరకు 60 బస్ సర్వీసులను నడుపుతున్నట్లు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం అవసరమైతే మరికొన్ని బస్సులను సిద్ధంగా ఉంచామని వెల్లడించారు. సురక్షితమైన ప్రయాణానికి ఆర్టీసీని ఉపయోగించాలని భక్తులను కోరారు.కొత్త బస్టాండ్‌తో పాటు పలు ప్రధాన కూడళ్ల నుంచి జాతరకు బస్సులను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ సురేందర్, అసిస్టెంట్ మేనేజర్ సైదులు తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ల పేరుతో ఎన్నికల వాయిదా సరికాదు

● మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

గరిడేపల్లి, ఫిబ్రవరి 16: రిజర్వేషన్ల పేరుతో రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలను వాయిదా వేయడం సరికాదని మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే, సీపీఎం రాష్ట్ర నాయకుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఎంఎస్ భవన్‌లో ఏర్పాటు చేసిన పార్టీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామ పంచాయతీల పాలకవర్గాలు రద్దయి సంవత్సరం దాటినా ఎన్నికలు జరుపకపోవడంతో గ్రామాల్లో సమస్యలు పెరిగిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రత్యేకాధికారుల పాలనలో సమస్యలు తీరడం లేదని, వెంటనే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి రిజర్వేషన్ల సమస్యలపై చర్చ జరిపి ఎన్నికలను నిర్వహించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజలపై కపట ప్రేమను చూపుతుందని విమర్శించారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు వ్యతిరేకంగా ఈ నెల 18,19 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు, నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చామని తెలిపారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పారేపల్లి శేఖర్‌రావు, మండల కార్యదర్శి షేక్ యాకూబ్, జిల్లా కమిటీ సభ్యులు మేకనబోయిన శేఖర్, మట్టయ్య, నారాయణ, ఆకుల అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ నియోజకవర్గంలో 386 పోలింగ్ కేంద్రాలు

నేరేడుచర్ల, ఫిబ్రవరి 16: హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని 7 మండలాల్లో నిర్వహించే జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు అధికారులు 386 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశారు. నియోజకవర్గంలో 146 గ్రామ పంచాయతీలు ఉండగా, 7 జడ్పీటీసీ, 71 ఎంపీటీసీ స్థానాలకు త్వరలో ఎన్నికలు నిర్వహించనున్నారు. నేరేడుచర్ల, హుజూర్‌నగర్ మున్సిపాలిటీలోని ఓటర్లను మినహాయిస్తే మొత్తం 7 మండలాల్లో 1318 వార్డులు, 2,10,576 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 1,02,351 మంది, మహిళలు 1,08,216 మంది, ఇతరులు 9 మంది ఉన్నారు. నేరేడుచర్ల మండలంలో 22,411 మంది ఓటర్లు, మేళ్లచెరువు 34,397, చింతలపాలెం 27,086, హుజూర్‌నగర్ 20,868, పాలకవీడు 21,490, గరిడేపల్లి 46,524, మఠంపల్లిలో 37,800 మంది ఓటర్లు ఉన్నారు. ఈసారి కూడా పురుష ఓటర్ల కన్నా మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు.

ఆర్థిక సాయం

నాగారం: వీరేశం కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నాగారం, ఫిబ్రవరి 16: మండల కేంద్రానికి చెందిన చిప్పలపల్లి వీరేశం ఇటీవల అకాల మరణం చెందారు. వీరేశం కుటుంబానికి మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి రూ.10 వేల ఆర్థిక సాయం చేశారు. ఈ మొత్తాన్ని ఆదివారం బీఆర్ఎస్ మండల నాయకుల ద్వారా వీరేశం కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు గుండగాని అంబయ్య, మాజీ ఎంపీపీ కూరం మణివెంకన్న, మండల నాయకుడు చిప్పలపల్లి సోమయ్య, మాజీ సర్పంచ్ చిప్పలపల్లి రాములు, నాయకులు చిప్పలపల్లి చిరంజీవి, కన్నెబోయిన అంజయ్య, చిప్పలపల్లి ఎల్లయ్య, చిప్పలపల్లి మల్లేశ్, కుంభం వెంకన్న, కన్నెబోయిన బాలమ్మ, చిప్పలపల్లి బాలస్వామి, వెంకన్న, క్రాంతి, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

కోదాడ రూరల్: మండలంలోని కాపుగల్లు గ్రామానికి చెందిన జిల్లా అరుణ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. ఆదివారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మండల నాయకుడు దొంతగాని అప్పారావు ఆధ్వర్యంలో ఆమె కుటుంబ సభ్యులకు రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు.

ఆత్మకూర్.ఎస్: మండలంలోని నెమ్మికల్ గ్రామానికి చెందిన గీత కార్మికుడు మడ్డి రాములు ఇటీవల తాటిచెట్టు నుంచి కిందపడ్డారు. రాములు కుటుంబానికి పాత సూర్యాపేటకు చెందిన సామ సవేందర్‌రెడ్డి ఆదివారం అర క్వింటా బియ్యం వితరణ చేశారు. కార్యక్రమంలో జంట వెంకటేశ్వర్లు, జంగ బాల రాజు, వెంకన్న, నార్ల అంజి, రాంబాబు, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

● మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్

పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే

చందంపేట(దేవరకొండ), ఫిబ్రవరి 16 : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. గ్రీన్ ఇండియా చాలెంజ్, వృక్షార్చన కార్యక్రమంలో భాగంగా నిర్వహించే మేము సైతం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం దేవరకొండలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం మాజీ ఎంపీ సంతోష్‌కుమార్ చేసిన కృషి వెలకట్టలేనిదన్నారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడంతో పాటు వాటిని పరిరక్షించుకోవాలని సూచించారు. తెలంగాణ అభివృద్ధి కోసం పరితపించే నాయకుడు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. ఆయన పుట్టిన రోజున పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేముల రాజు, నాయకులు బొడ్డుపల్లి కృష్ణ, పొట్ట మధు పాల్గొన్నారు.

కబడ్డీ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

హుజూర్‌నగర్, ఫిబ్రవరి 16: జిల్లా కబడ్డీ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం హుజూర్‌నగర్‌లో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అల్లం ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా నామా నరసింహారావు, వైస్ ప్రెసిడెంట్‌గా శెట్టి రామచంద్ర, ట్రెజరర్‌గా సైదులు, జాయింట్ సెక్రటరీలుగా శ్రీనివాస్‌రెడ్డి, రమేశ్, రాజు, మణికుమార్, ప్రదీప్‌ను ఎన్నుకున్నారు.

'యుద్ధభేరి'ని జయప్రదం చేయాలి

కోదాడ రూరల్/కోదాడ టౌన్, ఫిబ్రవరి 16: యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ (యూపీఎస్) విధానాన్ని నిరసిస్తూ మార్చి 2వ తేదీన హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే యుద్ధభేరి ధర్నాను జయప్రదం చేయాలని తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బడుగుల సైదులు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఏప్రిల్ 1వ తేదీ నుంచి కేంద్ర ప్రభుత్వం అమలు చేయనున్న యూపీఎస్ విధానంతో ఉద్యోగుల భవిష్యత్తు కార్పొరేట్ శక్తుల చేతుల్లో పెట్టినట్లవుతుందని అన్నారు. ధర్నాలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

'నేడు పెన్షనర్ల భవన ప్రారంభోత్సం'

సూర్యాపేట టౌన్, ఫిబ్రవరి 16: నేడు తిరుమలగిరిలో చేపట్టనున్న పెన్షనర్ల నూతన భవన ప్రారంభోత్సవానికి పెన్షనర్లు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎన్.సుదర్శన్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుంటకండ్ల దామోదర్‌రెడ్డి, రాష్ట్ర జనరల్ సెక్రటరీ సీహెచ్.చంద్రశేఖర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్.సీతారామయ్య హాజరవుతున్నట్లు తెలిపారు. పెన్షనర్ల పెండింగ్ సమస్యల పరిష్కారానికి రాష్ట్రవ్యాప్త కార్యక్రమంపై వివరించనున్నందున, అన్ని మండలాల అధ్యక్ష, కార్యదర్శులు, జిల్లా సంఘం బాధ్యులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

అదృశ్యమైన వృద్ధురాలి మృతదేహం లభ్యం

నూతనకల్, ఫిబ్రవరి 16: మూడు రోజుల క్రితం అదృశ్యమైన ఓ వృద్ధురాలు బావిలో మృతదేహమై తేలింది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నూతనకల్‌కు చెందిన పెరుగు నర్సమ్మ (69) గత కొద్దిరోజుల నుంచి మతిస్థిమితం కోల్పోయి ఇబ్బందులు పడుతున్నది. ఈ క్రమంలోనే మూడు రోజుల క్రితం ఇంట్లో నుంచి వెళ్లిపోగా, కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా, ఆదివారం ఉదయం అదే గ్రామంలోని ఓ వ్యవసాయ బావిలో వృద్ధురాలి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట ఏరియా హాస్పిటల్‌కు తరలించారు. కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేంద్రనాథ్ తెలిపారు.

కుక్కల దాడిలో గొర్రెలు మృతి

అర్వపల్లి, ఫిబ్రవరి 16: మండల పరిధిలోని జాజిరెడ్డిగూడెంలో కుక్కల దాడిలో గొర్రెలు మృత్యువాత పడ్డాయి. గ్రామానికి చెందిన మెరుగు దేవయ్య తన ఇంటి పక్కన ఉన్న మందలో గొర్రెలను తోలాడు. శనివారం రాత్రి మందలోకి కుక్కలు చొరబడి 30 గొర్రెలపై దాడి చేసి చంపాయి. వాటి విలువ సుమారు రూ.3 లక్షలు ఉంటుందని దేవయ్య తెలిపారు.

'చలో విద్యుత్ సౌధ'ను జయప్రదం చేయాలి

హుజూర్‌నగర్, ఫిబ్రవరి 16: తెలంగాణ విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఆర్జిజన్లను కన్వర్షన్ చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20వ తేదీన నిర్వహించే చలో విద్యుత్ సౌధ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ వెంకటనారాయణ అన్నారు. ఈ మేరకు ఆదివారం స్థానిక డీఈ కార్యాలయంలో చలో విద్యుత్ సౌధ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. నాయకులు నాగేశ్వర్‌రావు, సత్యంబాబు పాల్గొన్నారు.

కేసీఆర్‌ను కలిసిన రైతు సంఘం నాయకుడు సురేశ్

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌తో సురేశ్‌యాదవ్

అర్వపల్లి, ఫిబ్రవరి 16: తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను మండలంలోని కాసర్లపహాడ్ గ్రామానికి చెందిన రైతు సంఘం నాయకుడు మెండే సురేశ్‌యాదవ్ ఆదివారం ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో కలిశారు. ఈ సందర్భంగా కేసీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

బేతవోలులో కాంగ్రెస్ నాయకుల ఘర్షణ

గ్రామస్థులతో మాట్లాడుతున్న పోలీసులు

చిలుకూరు, ఫిబ్రవరి 16: మండలంలోని బేతవోలు గ్రామంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీలోని రెండు వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. గ్రామంలోని పురాతన సీతారామచంద్రస్వామి ఆలయం పునర్నిర్మాణం కోసం ఆలయ చైర్మన్ పెండ్యాల వీరస్వామి ఆధ్వర్యంలో శంకుస్థాపన కార్యక్రమం చేపట్టారు. అక్కడికి వచ్చిన కాంగ్రెస్ నాయకులైన మాజీ ఎంపీపీ బజ్జూరి వెంకట రెడ్డి, మాజీ సర్పంచ్ వట్టికూటి చంద్రకళ భర్త నాగయ్య వర్గాల మధ్య ఘర్షణ తలెత్తింది. గొడవ పెరిగి పెద్దదవడంతో ఇరువర్గాల వారు రాళ్లు విసురుకున్నారు. దీంతో పలువురికి గాయాలయ్యాయి. వట్టికూటి నాగయ్య వర్గానికి చెందిన వెంకటనర్సు అనే వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఘర్షణ విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ఇరువర్గాల వారిని చెదరగొట్టడంతో సమస్య సద్దుమణిగింది. కోదాడ రూరల్ సీఐ రజితారెడ్డి, చిలుకూరు, కోదాడ టౌన్ ఎస్ఐలు రాంబాబుగౌడ్, అనిల్‌రెడ్డి గ్రామంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.గ్రామంలో ప్రత్యేక బలగాలతో పికెటింగ్ నిర్వహిస్తున్నారు. ఘటనపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.

'మిర్చికి కనీస మద్దతు ధర రూ.25 వేలు ఇవ్వాలి'



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మట్టిపల్లి సైదులు

మోతె, ఫిబ్రవరి 16: మిర్చి పంటకు కనీస మద్దతు ధర రూ.25 వేలు ప్రకటించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మట్టిపల్లి సైదులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల పరిధిలోని తుమ్మలపల్లి గ్రామంలో నిర్వహించిన సీపీఎం గ్రామశాఖ సమావేశంలో ఆయన పాల్గొని మాటాడారు. మిర్చి ధర క్వింటాల్‌కు రూ.12,000కు తగ్గించి వ్యాపారులు రైతులకు గిట్టుబాటు లేకుండా చేస్తున్నారని అన్నారు. సరైన ధరలు లేకపోవడంతో మిర్చి రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ఖమ్మం జిల్లాలో ఇద్దరు రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని గుర్తుచేశారు. రాష్ట్రంలో మిర్చి బోర్డును ఏర్పాటు చేసి మద్దతు ధర నిర్ణయించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి చేయడంతో పాటు మార్క్‌ఫెడ్ ద్వారా మిర్చి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పంట కాలంలో వ్యాపారులు మార్కెట్లలో ధరలు తగ్గించడం, రైతుల నుంచి సరుకు వ్యాపారులకు చేరిన తర్వాత ధరలను రెట్టింపు చేయడం ప్రతి ఏటా జరుగుతున్నదని అన్నారు. రైతులు ఎకరాకు రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు పెట్టుబడి పెట్టారని, ప్రస్తుతం ఉన్న మార్కెట్ ధరల ప్రకారం పెట్టిన పెట్టుబడులు కూడా రాని పరిస్థితి ఉన్నదని తెలిపారు. సీపీఎం మండల కమిటీ